క్లుప్తంగా

పారిశుధ్యంపై దృష్టి సారించండి



నాలా శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఎండీ అంజద్ పాషా అన్నారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్‌లో జేసీపీ ద్వారా మురికి నాలాలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వానాకాలం కావడంతో నాలాల్లో మురికి నీరు నిల్వ ఉండడం వల్ల క్రిములు, కీటకాలు వృద్ధి చెందుతాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తుందన్నారు. ఎప్పటికప్పుడు మురికి నాలాలు శుభ్రం చేయించాలని పేర్కొన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి భీమయ్య తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

పెంచికల్‌పేట్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై కొమురయ్య అన్నారు. ప్రపంచ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లూర్ ఆశ్రమ, పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి పాటుపడాలి

కెరమెరి: ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల్లో ఉన్న బడీడు పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించుకోవాలన్నా రు. సకాలంలో రిపోర్టులు అందించాలని, ఎండీఎంలో మెనూ పాటించాలని, పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాములు వంద శాతం అందించాలని పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం లు చంద్రశేఖర్, భరత్ ఉన్నారు.

క్రీడా కిట్లు చోరీ

తిర్యాణి: మండల కేంద్రంలోని కుమురం భీం కమ్యూనిటీ హాల్‌లో భద్రపర్చిన తిర్యాణి గ్రామపంచాయతీకి సంబంధించిన రెండు స్పోర్ట్స్ కిట్లు చోరీకి గురైనట్లు పంచాయతీ కార్యదర్శి అంజయ్య తెలిపారు. చోరీకి గురైన క్రీడా కిట్ల విలువ దాదాపు రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కైరిగూడ ఓసీపీలో డీజిల్ బంక్ ప్రారంభం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీలో బుధవారం డీజిల్ బంక్‌ను ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కైరిగూడ ఓసీపీ దక్షిణ ప్రాంతం విస్తరణ పనుల్లో భాగంగా గతంలో ఉన్న డీజిల్ బంక్‌ను తొలగించాల్సి వచ్చిందన్నారు. ఓసీపీలోని యంత్రాలకు కావాల్సిన డీజిల్‌ను ఎప్పటికప్పుడూ సమకూర్చేందుకు తొలగించిన డీజిల్ బంకును డీ2 డంపు సమీపంలో తిరిగి ఏర్పాటు చేశామన్నారు. దాంతో ఓసీపీ విస్తరణకు ఎలాంటి అడ్డంకులు ఉండకపోవటంతో పాటు భవిష్యత్తులోనూ డీజిల్ బంక్‌ను తొలగించాల్సిన అవసరం ఉండదన్నారు. డీజిల్‌ను పొదుపుగా వినియోగించాలని, ఓసీపీని మరింత లాభాల్లో నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, డీజీఎం స్టోర్స్ శ్రీనివాస్‌రావు, డీజీఎం ఎఫ్‌అండ్‌ఏ రామారావు, ఎస్‌ఈ సివిల్ బాషా, ఇన్‌చార్జి ప్రాజెక్టు ఇంజనీరు నరేశ్, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, వేణు, మనోజ్ పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్‌లో బుధవారం పోలీసులు గుట్కా పట్టుకున్నారు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం గుట్కాలు నిల్వ ఉన్నాయనే ముందస్తు సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. పీకే బాల అనే వ్యక్తి దుకాణంలో గుట్కా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన గుట్కా విలువ రూ.4210 ఉంటుందన్నారు.

రేపు సంత వేలం

కౌటాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పశువుల సంత, వారాంతపు సంతల వేలం నిర్వహించనున్నట్లు కౌటాల గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ బుధవారం తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కాగజ్‌నగర్‌రూరల్: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని డీఎస్పీ కరుణాకర్ అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే చాలా నష్టాలు చవి చూడాల్సి వస్తుందన్నారు. డ్రగ్స్, గంజాయి వినియోగించడం నేరమన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శంకరయ్య, ఎస్సైలు అంజన్న, మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పెట్రోల్‌పంపు) విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ, మానవహారం నిర్వహించారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తే కలిగే నష్టాలపై సీఐ శంకరయ్య వివరించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, ఉపాధ్యాయులు కేశవ, రోజా, పద్మజ, అనీస్, హన్మంతు, రాజేశం, మల్లయ్య, ఇందిరా, సుధారాణి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: డ్రగ్స్ మహమ్మారిని తరిమేసి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని ఎస్సై నరేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మాదకదవ్యాల కారణంగా కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

రెబ్బెన: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రెబ్బెన సీఐ చిట్టిబాబు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ సేవించిన వ్యక్తి వాటి మత్తులో అనేక చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేసే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంతో డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కార్యక్రమంలో మత్తు పదార్థాలను అరికట్టేందుకు విద్యార్థులు, యువత యాంటీడ్రగ్స్ కమిటీల్లో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్స్‌గా సహకరించాలన్నారు. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, కళాశాల సిబ్బంది

జైనూర్: మాదక ద్రవ్యాలను విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని జైనూర్ సీఐ అంజయ్య, ఎస్సై సందీప్‌కుమార్‌లు అన్నారు. బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బీర్షావ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.



కాగజ్‌నగర్‌రూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ కరుణాకర్, సీఐ శంకరయ్య

కెరమెరి: మాదక ద్రవ్యాలతో ప్రాణహాని ఉంటుందని, వాటి బారిన పడకుండా యువత జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై గుంపుల విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి యువత పాశ్చత్య పోకడలకు పోయి తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలు, గుట్కా, గంజాయి వంటి వాటికి అలవాటు కాకూడదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పర్శరాములు ఉన్నారు.

కౌటాల: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సీఐ సాధిక్‌పాషా అన్నారు. బుధవారం కౌటాల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగిస్తే అనారోగ్యం పాలవుతారని, డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, తదితరులు పాల్గొన్నారు.



చింతలమానెపల్లి: కేజీబీవీలో..



జైనూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

దహెగాం: డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత దూ రంగా ఉండాలని ఎస్సై రాజు అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందన్నారు. డ్రగ్స్ వాడిన, విక్రయించినా చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్, అధ్యాపకులు నోముల చంద్రశేఖర్, ఆనంద్, మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



దహెగాం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు



రెబ్బెన: మాట్లాడుతున్న సీఐ చిట్టిబాబు



కెరమెరి: అవగాహన కల్పిస్తున్న విజయ్



కౌటాల: అవగాహన ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

‘పత్తి’కి విపత్తేనా..?

- జాడ లేని వాన
- మొలకెత్తని విత్తనాలు
- ఎండకు వాలిపోతున్న మొక్కలు
- రెండోసారి విత్తక తప్పదంటున్న అన్నదాతలు



ఎండ తీవ్రతకు వాలిపోతున్న మొక్క



దహెగాం శివారులో పలుచగా మొలకెత్తిన పత్తి మొక్కలు

దహెగాం: గత మూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టి వల్ల పత్తి రైతులు నష్టపోయారు. గత ఏడాది ఖరీఫ్ ఆరంభ సమయంలో వర్షాలు సంవృద్ధిగా కురిసినా పత్తి ఎదుగుదల, కాత దశలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు నష్టాలు చవిచూశారు. ఇప్పుడు ఖరీఫ్‌లోనైనా పత్తికి అనుకూలంగా వర్షాలు కురుస్తాయని మృగశిర కార్తెలోనే పత్తి విత్తనాలు విత్తుకున్నారు. కానీ విత్తనాలు వేసినప్పటి నుంచి వర్షాలు జాడ లేవు. ఒక్క భారీ వర్షం కూడా కురువలేదు. రెండు మోస్తారు వర్షాలు మాత్రమే కురువగా పత్తి పూర్తిస్థాయిలో మొలకెత్తలేదు. విత్తనాలు పలుచుగా మొలకెత్తాయని, మొలకెత్తిన మొక్కలు ఎండ తీవ్రతకు వాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

23వేల ఎకరాల్లో పత్తి సాగు..

మండలంలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో 23వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా పత్తి విత్తనాలు విత్తుకున్నారు. పది రోజుల క్రితం విత్తిన విత్తనాలు మోస్తారు వర్షం కురువడంతో మొలకెత్తాయి. కానీ వారం క్రితం విత్తిన విత్తనాలు వర్షం లేక మొలకెత్తలేదని రైతులు వాపోతున్నారు. వేల రుపాయలు పెట్టి విత్తనాలు కొనుగోలు చేశామని, వరుణ దేవుడు కరుణించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

రెండోసారి విత్తుకోవాల్సిందే..

ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయానికి ముందు ఒక ట్రెండు వర్షాలు కురిశాయి. దీంతో ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురుస్తాయని రైతులు పొలాలను సన్నద్ధం చేసి పత్తి విత్తనాలను విత్తుకున్నారు. కానీ వర్షాలు లేక విత్తనాలు పలుచగా మొలకెత్తాయని పేర్కొంటున్నారు. వర్షాలు కురిసిన చోట పత్తి మొలకెత్తిందని, వర్షాలు లేని చోట మొలకెత్తలేదని వాపోతున్నారు. మండలంలో ఇంతవరకు భారీ వర్షం కురవలేదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో రెండోసారి విత్తుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

71.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు..

ఈ సంవత్సరం జూన్‌లో ఇప్పటి వరకు 71.8 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఇదే గత సంవత్సరం జూన్ 26 వరకు మండలంలో 85.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో 14 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఉంది. వాతావరణ శాఖ వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని చెబుతున్నా వానలు పడడంలేదని పేర్కొంటున్నారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు బాగా కురువాలని ఆకాశం వైపు వేయి కళ్లతో ఆశగా చూస్తున్నారు.

రెండెకరాల్లో వేసిన



ఈ ఖరీఫ్ సీజన్‌లో రెండు ఎకరాల్లో పది రోజుల క్రితమే పత్తి పెట్టిన. చిన్నపాటి వర్షం కురువడంతో అవి మొలకెత్తాయి. కానీ వారం రోజుల నుంచి వాన కురవడం లేదు. మొలకెత్తిన పత్తి మొక్కలు ఎండకు వాలిపోతున్నాయి. నాలుగైదు రోజుల్లో వర్షం రాకుంటే అవి మాడిపోతాయి. దేవుని మీదనే భారం వేసినం. – దాసరి శంకర్, రైతు

పెద్ద వర్షం పడలేదు..



నేను 25 ఎకరాల్లో పత్తి పెట్టిన. పత్తి పెట్టినప్పటి నుంచి ఒక్క పెద్ద వర్షం కూడా కురువలేదు. చిన్నపాటి వర్షానికి అక్కడక్కడ పలుచగా విత్తనాలు మొలకెత్తినాయి. విత్తనాలు పెట్టే వరకు రూ.2.50 లక్షల ఖర్చు వచ్చింది. విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. మరోసారి విత్తుకోక తప్పేలా లేదు. – పెంటయ్య, రైతు

జూలై 15 వరకు విత్తుకోవచ్చు

పత్తి సాగు చేసే రైతులు జూలై 15 వరకు పత్తి విత్తనాలు విత్తుకోవచ్చు. వర్షాలు సమృద్ధిగా కురువలేదు. వర్షాలు కురుస్తాయని ఆశతో ముందుగానే విత్తుకున్నారు. వర్షలు లేక విత్తనాలు మొలకెత్తలేదు. రైతులు ఆందోళన చెందవద్దు. రైతులు వర్షాలు కురిసిన తరువాతనే విత్తుకోవాలి. వారం రోజులు వర్షాలు కురువకుంటే మొలకెత్తిన మొక్కలు సైతం వాడిపోయే అవకాశాలు ఉంటాయి. – రాజులనాయుడు, ఇన్‌చార్జి ఏవో

నానో ఎరువులు వినియోగించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వ్యవసాయదారులు అధిక దిగుబడులు పొందేందుకు నాణ్యమైన ఇండియన్ ఫార్మర్‌కో ఆపరేటివ్ లిమిటెడ్ నానో యూరియా, నానో డీఏపీలను పంటలకు వినియోగించి అధిక దిగుబడులు పొందాలని సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ ఇఫ్కో నానో యూరియా, నానో యూరియాలు వాడడం వలన తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులను పొందుతారన్నారు. అన్ని రకాల ఎరువులు ద్రవరూపంలోనే వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిని చల్లడం వలన మొక్కల ఆకుల ద్వారా పీల్చుకొని ఎరువు వృథా కాకుండా ఉంటుందని, భూమిని కాలుష్యం కాకుండా రక్షించుకోవచ్చన్నారు. ఇఫ్కో డీఎం బాల వికాస్‌రెడ్డి, హాక్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, ఏఈఓలు, సహకార సంఘం సీఈవో ఒజ్జల వెంకటరమణ, డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో ఖాదర్ హుస్సేన్

‘గొప్పలు చెప్పకోవడం సరికాదు’

కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే హరీశ్‌బాబు గొప్పలు చెప్పుకోవడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అందవెల్లి సమీప పెద్దవాగుపై నిర్మించిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయిన వెంటనే తాను అధికారులను సంప్రదించి శాశ్వత వంతెన అబార్ట్‌మెంట్‌పై మొరం వేసేలా చర్యలు తీసుకున్నానని, గొప్పల కోసం ఎమ్మెల్యే దీక్ష చేశారని ఆరోపించారు. ప్రతీ మండలంలో విత్తనాలు, ఎరువుల వ్యాపారుల వద్ద ఎమ్మెల్యేతో పాటు ఆయన బాబాయ్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంతకుముందు పార్టీ నాయకులపై నమోదైన కేసుల విషయంలో కాగజ్‌నగర్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య, చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి రైతు వేదికలో నూతన జాతీయ విద్యావిధానంపై అంగన్‌వాడీలకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. సీడీపీవో విజయ లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం పౌష్టికాహారం అందించడమే కాకుండా పిల్లలను పాఠశాలకు సంసిద్ధులను చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్స్ కరుణ, విజయలక్ష్మి, పెంచికల్‌పేట్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలి

వాంకిడి: మండలంలో 2023లో జరిగిన వివాహాలకు సంబంధించి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులు వివాహానంతరం కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకొని ఏడాది గడిచినా చెక్కులు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే చెక్కులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు దుర్గం నిఖిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మైనార్టీ గురుకుల పాఠశాలను రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జైనూర్: ఏజెన్సీ ప్రాంతంలో మైనార్టీ గురుకుల పాఠశాలను నిర్వహించడం ఏజెన్సీ చట్టాలకు విరుద్ధమని ఆయా సంఘాల నాయకులు తహసీల్దార్ తిరుపతికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం 5వ షెడ్యూల్డ్ భూభాగంలో ఉండటంతో ఈ ప్రాంతంలో మైనార్టీ గురుకుల పాఠశాల నిర్వహించడం రాజ్యాంగానికి విరుద్ధమని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మెస్రం శేకు, జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్, నాయకులు ఆత్రం భీంరావు, రాథోడ్ ధర్మేందర్, శివరాజ్ పాటిల్ శింధే, కేంద్రే సుబోధ్‌కాంత తదితరులు ఉన్నారు.

ఘనంగా సాహూ మహరాజ్ జయంతి



నివాళులర్పిస్తున్న ఆరె సంఘం నాయకులు

ఆసిఫాబాద్: ఛత్రపతి సాహూ మహరాజ్ 150వ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ భవన్‌లో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపెల్లి జయరాం సాహూ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సాహూ మహరాజ్ తన సంస్థానంలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. సాహూ మహరాజ్ సామాజిక సమానత్వం కోసం కృషి చేశారని కొనియాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోలె బిక్కాజి, చౌదరి గోపాల్, బొర్కుటె తిరుపతి, నాగపూర్ మారుతి, ఎలుములె దిలీప్, సంతోష్, జాబరి రవి, రాజు, మనోహర్, పోషన్న పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వేముల మల్లేశ్

తిర్యాణి: వజ్రోత్సవ వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్బీఎం, ఇంకుడు గుంతల సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. పనుల పరిశీలనకు కేంద్ర బృందం సభ్యులు త్వరలో రానున్నారని రికార్డులను పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీవో సుధాకర్ రెడ్డి, ఏపీవో షాకీర్ ఉస్మాని, ఈసీ రజిత ఉన్నారు.

నేడు వారసంత వేలం

కెరమెరి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు వారసంత వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ బకాయిలు ఉన్నవారు వేలానికి అనర్హులని, వేలంలో పాల్గొనేవారు రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు.